క్లుప్తంగా

చిరుధాన్యాలపై అవగాహన

మేడ్చల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న పోషణ పక్షంలో భాగంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హైమావతి మూడవ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ పక్షంలో పాల్గొని అవగాహన కలిపించారు. కౌమార దశలో ఉన్న బాలికలకు మిల్లెట్స్ ఎంతో దోహదం చేస్తాయని అన్నారు. మినుములు, కొర్రలు, రాగులు, సజ్జలు, పెసర్లు వంటి చిరు ధాన్యాలు సంపూర్ణ ఆరోగ్యం కోసం ఎంతగానో పనిచేస్తాయని అన్నారు. చిరుధాన్యాలను రోజువారి తీసుకునే ఆహారంలో భాగంగా చేర్చుకోవాలని ఆమె సూచించారు. అంగన్‌వాడీ టీచర్ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు కార్యకర్తలే పట్టుగొమ్మలు



మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

మేడ్చల్: బీఆర్‌ఎస్‌కు కార్యకర్తలే పట్టుగొమ్మలని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చామకూర మహేందర్‌రెడ్డి అన్నారు. మేడ్చల్‌లో నిర్వహించిన పార్టీ పట్టణ సమావేశంలో ఆయన పాల్గొని పలు సూచనలు ఇచ్చారు. మున్సిపల్‌శాఖ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించాలని, పార్టీ కార్యకర్తలకు గుర్తింపు ఇవ్వాలని అన్నారు. ఈ నెల 4వ తేదీన మేడ్చల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించాలని, ప్రతి నాయకుడు కార్యకర్త హాజరయ్యేలా చూడాలని అన్నారు. సమావేశంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు శేఖర్‌గౌడ్, కౌన్సిలర్లు దేవరాజ్, గణేష్, హరికృష్ణ, స్వామియాదవ్, కోఆప్షన్ సభ్యులు మహబూబ్‌అలీ, నవీన్‌రెడ్డి, నాయకులు నర్సింహారెడ్డి, ఈశ్వరయ్య, సత్యనారయణ, బాలమల్లేష్, లాయక్ అలీ, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ కళాశాలలో ఈ నెల 7న నిర్వహించనున్న ఫలూజా మ్యూజికల్ కాంసెర్ట్ కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను శుక్రవారం సీఎంఆర్ గ్రూప్స్ కార్యదర్శి గోపాల్‌రెడ్డి విడుదల చేశారు. కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎంఆర్ గ్రూప్స్‌కు చెందిన ప్రిన్సిపాల్‌లు, డైరెక్టర్లు, హెచ్‌ఓడీ, అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బాలీవుడ్ సింగర్స్ విశాల్, శేఖర్ పాల్గొంటారని తెలిపారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పవన్‌కుమార్



ఓట్లు వేస్తున్న న్యాయవాదులు

మేడ్చల్: మేడ్చల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా న్యాయవాది పవన్‌కుమార్ విజయం సాధించారు. శుక్రవారం మేడ్చల్ న్యాయస్థానం ఆవరణలో ఎన్నికలు జరగ్గా పవన్‌కుమార్ 14 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శిగా విజయారెడ్డి విజయం సాధించారు. ఫలితాల అనంతరం విజయం సాధించిన అనంతరం న్యాయవాదులు సంబరాలు జరుపుకున్నారు.

పరిశుభ్రమైన నీరు అందించాలి

మేడ్చల్: గౌడవెల్లి ప్రజలకు పరిశుభ్రమైన నీరు అందించాలని గ్రామ సర్పంచ్ సురేందర్‌ముదిరాజ్ అన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ సిబ్బంది, ఆరోగ్య ఉప కేంద్రం సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. తాగునీటి ట్యాంకులను శుభ్రం చేసి బ్లీచింగ్ చేయాలని, నీటి సరఫరాలో ఎలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో సిబ్బంది వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులో నిందితులకు జైలు

జవహర్‌నగర్: అట్రాసిటీ కేసులో నిందితులకు ఎల్బీనగర్ ఏడవ అదనపు కోర్టు జైలు శిక్ష విధించింది. జవహర్‌నగర్ పోలీసుల వివరాల ప్రకారం.. అంబేడ్కర్‌నగర్‌లో నివసించే ఎరుకల కుటుంబానికి చెందిన వారు పందులు పెంచుతూ జీవనం కొనసాగిస్తున్నారు. ఇళ్ల వద్ద పందులు ఉండవద్దంటూ ఇంటి ప్రహరీని కూల్చివేసి కులం పేరుతో 2016లో ముగ్గురు వ్యక్తులు దౌంతరబోయిన పారిజాతం(53), శ్రావణ్‌కుమార్(35), మరో నిందితుడు (మృతి చెందాడు)పై జవహర్‌నగర్‌లో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు వివరాలు సేకరించిన ఎల్బీనగర్ ఏడవ అదనపు కోర్టు నిందితులను దోషులుగా నిర్ధారిస్తూ 6 నెలల జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ.2 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

సేకరణకు దిక్కులేక.. గుట్టలుగుట్టలుగా..

- రోడ్లపై కుప్పలుగా పేరుకుపోతున్న చెత్త
- తడి, పొడి సేకరణలోనూ నిర్లక్ష్యం
- ఒక్కో పురపాలికలో 49 టన్నుల సేకరణ
- కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానిక ప్రజలు



సాక్షి, మేడ్చల్ జిల్లా: పురపాలికల్లో తడి, పొడి చెత్త సేకరణ లక్ష్యం నెరవేరడం లేదు. ప్రతిరోజూ చెత్తను వేరుచేసి సేకరించాల్సి ఉన్నా సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. నగర శివారుల్లోని మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలో 29 పురపాలక సంఘాలు ఉన్నాయి. రోజూ లక్ష జనాభా కలిగిన పురపాలికలో 67 టన్నులు, లక్షలోపు జనాభా ఉన్న పురపాలికల్లో 40 టన్నుల చెత్త సేకరణ జరుగుతోంది. చెత్తను వేరుచేసి అందించాల్సిన ఉన్నా.. పీర్జాదిగూడతో సహా కొన్ని మినహాయించి.. మెజార్టీ పురపాలికల్లో అలా జరగడం లేదని తెలుస్తోంది. పుర అధికారులు మాత్రం చెత్త ట్రాక్టర్లకు మైకులు పెట్టుకొని తడి, పొడి చెత్తను వేరుచేసి ఇవ్వాలని ప్రచారం చేస్తున్నా.. ఆచరణలో అమలుచేయడంలో విఫలమవుతున్నారు.

సమయానికి రాక.. రోడ్లపైనే పారబోత..

చెత్త తరలించే వాహనాలు డివిజన్లు/వార్డులకు సమయానికి రాకపోవడంతో పురపాలికల్లో చెత్తను రోడ్ల పక్కన పారబోస్తున్నారు. సరైన అవగాహన లేకపోవడంతో తడి, పొడి చెత్త విభజన జరగడం లేదు. ప్రతి డివిజన్/వార్డుకు వాహనం, సిబ్బందిని కేటాయించినా సేకరణ విషయంలో అలసత్వం వహిస్తున్నారు. రోజుల తరబడి తడి, పొడి చెత్త నిర్వహణ విషయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విభజించుకొని ప్రత్యేక బృందాలతో ప్రతి వార్డుల్లో తడి, పొడి చెత్త సేకరణ విషయమై కాలనీవాసులకు అవగాహన కల్పించారు. ప్రతి ఇంటికీ గ్రీన్, బ్లూ చెత్త డబ్బాలు ఉన్నాయి. అయినా సేకరణలో మార్పు రావడం లేదు.

ఫిర్యాదు చేస్తేనే స్పందన..

అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో తడి, పొడి చెత్త సేకరణ అమలు కావడం లేదు. పట్టింపు లేక పారిశుద్ధ్య సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వార్డు అధికారులు నిత్యం పర్యవేక్షణ చేయడం లేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తేనే స్పందిస్తున్నారు. వార్డుల్లో తిరిగి అవగాహన కల్పించాల్సి ఉన్నా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. కొన్ని వార్డుల్లో రెండు రోజులకోసారి చెత్త తరలించే వాహనం రావడంతో అప్పటి వరకు ఇళ్లలోనే నిల్వ ఉంటోంది. చేసేది లేక కాలనీలో రోడ్ల వెంట పారబోస్తున్నారు. దీంతో తడి, పొడి చెత్త సేకరణ అమలుకు పునాది పడటం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అవగాహన కల్పించి తడి, పొడి చెత్త సేకరణ జరిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

రాహుల్ సభ్యత్వాన్ని పునరుద్ధరించాలి

- నేటినుంచి 17 ప్రతిపక్ష పార్టీలతో నిరసన కార్యక్రమాలు
- సమావేశంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మల్లు రవి



మాట్లాడుతున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మల్లు రవి

సాక్షి, మేడ్చల్ జిల్లా: రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని పునరుద్ధరించి, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మల్లు రవి డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మేడ్చల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్, టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని తీవ్రంగా ధ్వజమెత్తారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షాలు ప్రజాస్వామ్య వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని ఆరోపించారు. దేశపాలనంతా వారి చేతుల్లోకి తీసుకుని విమర్శించే వారిపై నియంతృత్వంతో ఉక్కుపాదం మోపుతున్నారన్నారు. దేశంలో లలిత్ మోదీ, నీరవ్ మోదీ, ఆదానీలు దోచుకుంటున్నారని, వారికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కాపలా కాస్తున్నారన్నారు. రాహుల్ గాంధీ విమర్శిస్తే, గాంధీ కుటుంబంపై వేధింపులతో తప్పుడు కేసులు బనాయిస్తున్నారన్నారు. దేశ సంపదను కొల్లగొట్టిన అదానీతో ప్రధాని మోదీకి ఉన్న వ్యాపార భాగస్వామ్యాన్ని పదేపదే ప్రశ్నిస్తున్నందుకే రాహుల్ గాంధీపై బీజేపీ ప్రభుత్వం ప్రతీకారంతో వ్యవహరిస్తోందని ఆరోపించారు. రాహుల్ గాంధీపై ఉన్న నాలుగేళ్ల నాటి కేసును తిరగదోడి, 25 రోజుల్లో విచారణ పూర్తిచేసి కుట్రపూరితంగా రెండేళ్ల శిక్ష విధించి లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేశారని మల్లు రవి విమర్శించారు. ఒక ఎంపీకి రాజ్యాంగం కల్పించిన హక్కును హరించడం ద్వారా బీజేపీ ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరించిందన్నారు. రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయడమంటే.. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ఆయన అభిప్రాయపడ్డారు.

నేటి నుంచి నిరసనలు...

రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని పునరుద్ధరించే వరకు ఆందోళనలు కొనసాగుతాయన్నారు. ఈనెల 1 నుంచి 8 వరకు నిరసనలు, ఛలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కొలన్ హన్మంతరెడ్డి, మందుమల్ల పరమేశ్వర్‌రెడ్డి, సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, టీపీసీసీ జనరల్ సెక్రటరీ చరణ్ కౌశిక్ యాదవ్, నాయకులు చంద్రశేఖర్, సంతోష్‌రాజ్, కృష్ణాగౌడ్, రమేష్, రాఘవేంద్ర, యాదగిరి పాల్గొన్నారు.

బొక్కెనిగూడ చౌరస్తాలో చలివేంద్రం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సురేందర్‌రెడ్డి

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని మూడో వార్డు బొక్కెనిగూడ చౌరస్తాలో 'మన అక్షయ ఫౌండేషన్' ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు, మాజీ ఉప సర్పంచ్ బొక్క సురేందర్‌రెడ్డి హాజరై చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ స్టీవెన్, సాయిలు, సంజీవరెడ్డి, బాల్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మధుసూదన్ రెడ్డి, నగేశ్, గోపి, మహేశ్, మల్లారెడ్డి, రాంనాథ్, రమేశ్, మహేందర్‌రెడ్డి రాజయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

ఘనంగా రాజమల్లారెడ్డి బర్త్ డే



కేక్ కట్ చేస్తున్న రాజమల్లారెడ్డి

మేడ్చల్: ఎంపీపీ భర్త డబీల్‌పూర్ మాజీ సర్పంచ్ వీర్లపల్లి రాజమల్లారెడ్డి పుట్టిన రోజును డబీల్‌పూర్ గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులు, అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. ఆయన నివాసం వద్ద వేదిక ఏర్పాటు చేసి కేక్ కట్ చేయించి ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి వేడుకలకు హాజరై రాజమల్లారెడ్డి చేత కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో ఎంపీపీ రజితరెడ్డి, సర్పంచ్ గీత భాగ్యారెడ్డి, మండల, మున్సిపాలిటీల నాయకులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలి



సాక్షి, మేడ్చల్ జిల్లా: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ ముట్టడిలో భాగంగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు, కార్యకర్తలు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టని పక్షంలో 3వ తేదీన బీజేపీ జిల్లా కార్యాలయాల వద్ద భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. అలాగే 4న జాతీయ రహదారుల దిగ్బంధనం కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ రామచంద్ర, కళామండలి అధ్యక్షుడు ఎస్‌వై అశోక్, నాయకులు సతీష్, ప్రణయ్, శివకుమార్, స్వామి, శంకర్, శ్రీనివాస్, సంజీవ, యాదగిరి, సిద్ధయ్య, నరసింహులు, తిరుపతి, మహేష్, చిరంజీవి, రమేష్, కృష్ణ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

పోచారం: యమ్నంపేట్‌లోని శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాలలో రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్, షీ టీమ్స్, సైబర్ క్రైమ్స్, లా అండ్ ఆర్డర్ విభాగాల ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి డీసీపీ జానకి, సైబర్ క్రైమ్స్ డీసీపీ డా.బి.అనురాధ, మహిళా రక్షణ విభాగం డీసీపీ శ్రీబాల తదితరులు మాట్లాడుతూ.. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల పట్ల ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. సైబర్ బెదిరింపులు, స్టాకింగ్స్‌ను ఎలా ఎదుర్కోవాలో తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.



సైబర్ నేరాలపై మాట్లాడుతున్న డీసీపీ జానకి

సుబ్రహ్మణ్యేశ్వర ఆలయ వార్షికోత్సవం

కీసర: నాగారం మున్సిపాలిటీ 15వ వార్డు పరిధిలోని ఈస్ట్‌గాంధీనగర్‌కాలనీలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. పూజల్లో మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, ఆలయ అధ్యక్షులు, స్థానిక కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మాదిరెడ్డిస్వప్న వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. దాతల సహకారంతో నిర్మించిన దేవాలయ కమాన్‌ను వారు ప్రారంభించారు. కౌన్సిలర్లు అన్నంరాజు లావణ్యశ్రీనివాస్, కౌకుట్ల మమతకృష్ణారెడ్డి, కాలనీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, జశ్వంత్‌సింగ్, ఆలయ కమిటీ సభ్యులు మూర్తి, కొండల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, కైలాష్‌యాదవ్, ప్రవీణ్, శ్రీనివాస్, వెంకట్, భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల సేకరణకు వేలం

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల పరిధిలోని చికెన్, మటన్ దుకాణాల నుంచి వ్యర్థాలను సేకరించేందుకు శుక్రవారం నాగారం మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించిన బహిరంగ వేలం పాటను ఎండీ.కలీం రూ.3 లక్షలకు వేలంపాటలో దక్కించుకున్నాడు. మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, కమిషనర్ వాణీరెడ్డి, కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ మేనేజర్ చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు అభివృద్ధివైపు పయనించాలి



సదస్సులో సాయికత్ దత్‌తో అనురాగ్ ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఘట్‌కేసర్: విద్యార్థులు నిరంతరం అభివృద్ధి వైపు పయనించాలని యంత్ర అభ్యాసం పుస్తకం రచయిత సాయికత్ దత్ అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో యంత్ర అభ్యాసం అనే అంశంపై ఐఈఈఈ అనుసంధానంతో శుక్రవారం కృత్రిమ విభాగంపై శుక్రవారం నిర్వహించిన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యంత్ర అభ్యాసంతో అభివృద్ధిపై పరిశోధనలు జరపాలన్నారు. అనురాగ్ యూనివర్సిటీ ఉప కులపతి రాంచంద్రం, రిజిస్ట్రార్ ఫాతిమా, హెచ్‌ఓడీ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్ఐఈటీలో టెక్నికల్ ఫెస్ట్ షురూ..

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్ఐఈటీ కళాశాలలో టెక్నోత్సవ్ 2023 పేరిట నిర్వహిస్తున్న టెక్నికల్ ఫెస్ట్‌ను శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ అశోక్, డైరెక్టర్ ప్రవీణ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు తమ పరిజ్ఞానాన్ని విస్తృతం చేసుకోవడానికి టెక్నికల్ ఫెస్ట్‌లు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో 1500లకు పైగా రిజిస్ట్రేషన్స్ వచ్చాయని తెలిపారు. అనంతరం కార్యక్రమ సావనీర్ సీడీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కన్వీనర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



టెక్నోత్సవ్ సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, డైరెక్టర్

హెడ్ కానిస్టేబుల్ ఖదీర్‌కు సన్మానం



ఎండీ ఖదీర్‌ను సన్మానిస్తున్న సీపీ డీఎస్.చౌహాన్

కీసర: రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కీసర పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఎండీ.ఖదీర్ శుక్రవారం స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంప్ ఆఫీస్‌లో రాచకొండ కమిషనర్ డీఎస్.చౌహాన్ ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. సీపీ మాట్లాడుతూ ఉద్యోగ నిర్వహణలో సుదీర్ఘకాలంగా అంకితభావంతో పనిచేసి ఉద్యోగ విమరణ చేస్తున్న ఖదీర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలని, కుటుంబసభ్యులతో సంతోషంగా గడపాలని సూచించారు. డీసీపీ అడ్మిన్ పి.ఇందిర, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు సీహెచ్.భద్రారెడ్డి, కృష్ణారెడ్డి, రవుఫ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు గుణపాఠం తప్పదు

- గ్రామాల్లో బీజేపీని మరింత బలోపేతం చేయాలి
- పార్టీ జాతీయ కార్యదర్శి అరవింద్‌మీనన్



మాట్లాడుతున్న బీజేపీ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర సహ ఇన్‌చార్జి అరవింద్‌మీనన్

కీసర: గ్రామాల్లో బూత్‌స్థాయిలో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు బీజేపీ నేతలు, కార్యకర్తలు కృషిచేయాలని బీజేపీ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర సహ ఇన్‌చార్జి అరవింద్‌మీనన్ అన్నారు. చీర్యాల గ్రామంలోని జయమోహన్‌గార్డెన్‌లో మేడ్చల్ జిల్లా రూరల్ అధ్యక్షుడు పటోళ్ల విక్రంరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని, బీజేపీని ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. దేశంలోని నరేంద్రమోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను పెద్దఎత్తున ప్రజలకు తెలియజేస్తూ ముందుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు, ప్రజల సమస్యలపై స్థానికంగా పోరాటాలు చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కె.మాధవి, రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కొంపల్లి మోహన్‌రెడ్డి, డాక్టర్ ఎస్.మల్లారెడ్డి, జిల్లా ఇన్‌చార్జి వేముల నరేందర్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుద్ధి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శులు జిల్లాల తిరుమల్‌రెడ్డి, కూరపాటి విజయ్‌కుమార్, ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి బీఆర్‌ఎస్ కృషి

నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి



చంద్రమ్మకు పింఛన్ డబ్బులు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు

కీసర: పేదల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం, చిత్తశుద్ధితో కృషిచేస్తోందని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రభుత్వం ఇటీవల పింఛన్లకు సంబంధించి జారీ చేసిన కొత్త జీ.వో ఆధారంగా రామగోని చంద్రమ్మకు మంజూరైన ఆసరా పింఛన్ నగదును ఆయన లబ్ధిదారురాలికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల రామగోని చంద్రమ్మ భర్త రామగోని బాలిశెట్టి అనారోగ్యంతో మృతి చెందాడని, ప్రభుత్వం కొత్త జీ.వో ప్రకారంగా భర్త చనిపోవడంతో ఆయన పింఛన్‌ను ఆమెకు మంజూరు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు పారదర్శక పాలన అందిస్తాం

మున్సిపల్ చైర్ పర్సన్ పావనీయాదవ్



మాట్లాడుతున్న చైర్ పర్సన్ పావనీయాదవ్, వైస్ చైర్మన్ మాధవరెడ్డి

ఘట్‌కేసర్: మున్సిపాలిటీ ప్రజలకు పారదర్శక, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీయాదవ్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ అధ్యక్షతన శుక్రవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2023-24 సంవత్సరంలో రూ.12.6 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, అధికారులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. మున్సిపాలిటీలో రెండు వార్డులకు ఒక చెత్త వాహనం ఏర్పాటు చేయాలని, ప్రజలకు అవసరమైన తాగునీరు, డ్రైనేజీలు, విద్యుత్ సమస్యలు, సీసీ, బీటీ రోడ్ల మరమ్మతు పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ వేమనరెడ్డి, వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, రమాదేవి, సంగీత, ఆంజనేయులుగౌడ్, అనురాధ, నాగజ్యోతి, హేమలత, శశికళ, మల్లేశ్, జహంగీర్, నర్సింగ్‌రావు, రవీందర్, కోఆప్షన్ సభ్యులు సురేందర్‌రెడ్డి, పి.అరుణ, షౌకత్, మేనేజర్ అంజిరెడ్డి, కార్యలయం సిబ్బంది పాల్గొన్నారు.

రూ.21.34 కోట్లతో పోచారం బడ్జెట్ ఆమోదం



పోచారం బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం: పోచారం పురపాలక సంఘ బడ్జెట్ సమావేశం చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. సమావేశంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.21.34 కోట్ల అంచనా ఆదాయం, రూ.20.78 అంచనా వ్యయం, రూ.56.04 లక్షల ముగింపు నిల్వతో రూపొందించిన ముసాయిదా బడ్జెట్‌ను మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. రూ.18.53 కోట్ల రెవెన్యూ ఆదాయం నుంచి 10 శాతం గ్రీన్ బడ్జెట్‌కు కేటాయించామన్నారు. నూతనంగా విలీనమైన వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి 3వ వంతు నిధులుగా రూ.2.46 కోట్లు ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. మౌలిక వసతుల కల్పనతో పాటు పలు అభివృద్ధి పనుల కోసం రూ.9.22 కోట్లు వ్యయం చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కమిషనర్ సురేష్, కౌన్సిల్ సభ్యులు గొంగళ్ల మహేష్, నర్రి ధనలక్ష్మి, చింతల రాజశేఖర్, ఆకిటి శైలజ, బాలగోని వెంకటేశ్ గౌడ్, మెట్టు బాల్‌రెడ్డి, బెజ్జంకి హరిప్రసాదరావు, నల్లవెల్లి లక్ష్మి, సామల శ్రీలత, బద్దం మమతా రాణి, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.27.32 కోట్లతో దమ్మాయిగూడ బడ్జెట్ ఆమోదం

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీకి సంబంధించి 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.27.32 కోట్ల అంచనా బడ్జెట్‌ను ఆమోదించడం జరిగింది. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అంచనా బడ్జెట్‌ను ఆమోదించామని మున్సిపల్ కమిషనర్ స్వామి తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.12.87 కోట్ల డిమాండ్ ఉండగా అందులో 31 మార్చి 2023 నాటికి రూ.8.97 కోట్లు (69.90)శాతం ఇంటి పన్నులు వసూలు చేయడం జరిగిందన్నారు.